క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

అద్దంకి: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నేడు 23న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దేవసేన కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు హాజరు కావాలని కోరారు.

నేడు మేదరమెట్ల మండల సమావేశం..

మేదరమెట్ల: కొరిశపాడు మండల సర్వసభ్య సమావేశం నేటి ఉదయం 11 గంటలకు ఉంటుందని ఎంపీడీవో సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలోని 14 సబ్ సెంటర్లలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున గ్రామాల్లోని చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యాలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్

చీరాల టౌన్: వర్షాలు కురుస్తున్నాయి.. ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటుగా ప్రజలకు క్లోరినేషన్ చేసిన మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జి ఈవోఆర్డీ మురళీ బాపూజీ అన్నారు. శుక్రవారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును క్లోరినేషన్ చేయించడంతో పాటుగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను వలంటీర్లతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో గ్రామ వలంటీర్లతో కలిసి స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈసందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీల్లో ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంకులను శుభ్రం చేయించి ప్రజలకు శుద్ధమైన మంచినీరు అందించేందుకు క్లోరినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పంట నమోదులో వీఏఏలు కీలకం

జే.పంగులూరు: పంట నమోదు, పథకాలను రైతులకు అందించడంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు చాలా కీలకమని మార్టూరు వ్యవసాయ సంచాలకులు కే శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ-క్రాప్ నమోదు, పీఎం కిసాన్, ఈ-కేవైసీపై ముప్పవరం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం శ్రీనివాసరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ ఈనెలాఖరులోపు తప్పనిసరిగా పీఎం కిసాన్ ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. 15 విడత పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాలో జమచేయాలంటే తప్పకుండా ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. ఈ-కేవైసీ పూర్తి చేయడానికి సెప్టెంబర్ 30 వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. రైతులు పంటలను ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయాధికారి డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు పంట నమోదు చేయించుకోవడం వల్ల ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలు వలన పంట నష్టం జరిగితే నష్టపరిహారం, సున్నా వడ్డీ పథకం, పండించిన పంట మద్దతు ధరకు అమ్ముకోవాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానంలో హద్దురాళ్లు తొలగించారని ఫిర్యాదు

బల్లికురవ: మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో సర్వే నంబర్ 95లోని వాగు పోరంబోకు భూమిలో శ్మశానానికి కేటాయించిన స్థలంలో హదురాళ్లు తొలగించారని తహసీల్దార్ కే రవిబాబు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన రావులపల్లి రామకృష్ణ పథకం ప్రకారం హద్దురాళ్లు తొలగించారని ప్రభుత్వ భూములు, శ్మశానాలను ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. ఏఎస్సై సీ. బాలకృష్ణ కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

కొనసాగుతున్న ఓటర్ల సర్వే

యద్దనపూడి: నియోజకవర్గంలో నకిలీ ఓట్లు నమోదై ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందిన నేపథ్యంలో మండలంలో ఓటర్ల సర్వే కొనసాగుతోంది. శుక్రవారం మండల కేంద్రమైన యద్దనపూడిలో డిప్యూటీ తహశీల్దారు మస్తాన్‌రావు, ఆర్ఐ విష్ణు, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ఓటర్ల సర్వే నిర్వహించారు. మరణించిన వారు, వివాహమై అత్తగారింటికి వెళ్లిన మహిళలు, స్థానికంగా ఇక్కడ నివాసం లేని ఓటర్లు గుర్తిస్తున్నట్లు డీటీ తెలిపారు. ఫాం-7 నమోదైన ఓటర్లు స్థానికంగా ఇక్కడే ఉంటున్నట్లైతే విచారణలో తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.


వేటపాలెంలో పాకనాటి వీధిలో నవరాత్రి పూజల్లో విఘ్నేశ్వరుడు


చీరాల: కూరగాయాల అలంకరణలో వినాయకుడు


అంబడిపూడిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


చీరాల: అరటిపండ్లతో అలంకరించిన గణేశుడు


అద్దంకి: కూరగాయల అలంకరణలో వినాయకుడు

జయజయ శుభకర వినాయక

- ఐదో రోజు నిమజ్జనాల హోరు
- గ్రామాల్లో ఉత్సాహంగా గణపతి నవరాత్రులు
- ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్న మెరైన్, సివిల్ పోలీసులు

చీరాల టౌన్/వేటపాలెం: లంబోదరుడు పార్వతీ తనయుడు వినాయకుడు నిమజ్జనానికి తరలుతున్నాడు. చలువ పందిళ్లల్లో ఏర్పాటు చేసిన గణనాథులు పూజలందుకుని ఐదో రోజు శుక్రవారం నిమజ్జనానికి వెళ్లాడు. జై బోలో గణేశ్ మహారాజ్‌కీ జై అంటూ గణపతి విగ్రహాలను యువకులు ఉత్సాహంగా ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. గుళాములు చల్లుకుంటూ ఆనందోత్సాహాల నడుమ గణపయ్యల విగ్రహాలను సముద్ర తీరాలకు తరలించారు. వేటపాలెం మండలంలోని పొట్టి సుబ్బయ్యపాలెం, కఠారివారిపాలెం, రామాపురం సముద్రతీరాలకు నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమాల్లో యువకులు, మహిళలు, భక్తులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేటపాలెం చుట్టు పక్కల గ్రామాలైన సంతరావూరు, ఇంకొల్లు ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలను ట్రాక్టర్లపై నిమజ్జనానికి తీసుకొచ్చారు. పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట, నర్సరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను తప్పెట్ల ఊరేగింపుల అనంతరం గంగఒడిలోకి వాడరేవు తీసుకువచ్చి నిమజ్జనం చేస్తున్నారు. వాడరేవులో నిమజ్జనాల సందడి నేపథ్యంలో చీరాల డీఎస్పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు, సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు.

బల్లికురవ: జైగణేష్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలతో నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన అంబడిపూడి, నక్కబొక్కలపాడు గ్రామాల్లో గణనాథులకు నాలుగు రోజులుగా అర్చనలు, అభిషేకాలు, రాత్రిళ్లు భజనలు చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలు డప్పువాయిద్యాలతో బల్లికురవ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

మేదరమెట్ల: అనమనమూరు గ్రామంలోని వినాయకుడి లడ్డూ వేలంపాటలో భాగంగా రూ.30 వేలకు సర్పంచ్ జంపు హరిబాబు సొంతం చేసుకున్నారు. లడ్డుని కమిటీ సర్పంచ్ కుమారుడు జంపు అఖిలేష్ యాదవ్, కుటుంబ సభ్యులకు అందజేశారు. పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని వినాయకుడి లడ్డుని పాడుకున్నామని వారు తెలిపారు. బల్లికురవ మండలం అంబడిపూడిలో పల్లపు కృష్ణమూర్తి వినాయకుడి లడ్డును రూ. 50 వేలకు కైవసం చేసుకున్నారు.

కూరగాయలతో అలంకరణ..

అద్దంకి: అద్దంకి పట్టనంలోని 17 వవార్డులోని బ్రాహ్మణ బజార్‌లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన పందిరిలో శుక్రవారం వివిధ రకాల కూరగాయలతో వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పలు రూపాల్లో విఘ్నేశ్వరుడు..

చీరాల అర్బన్: గణపతి నవరాత్రుల ఉత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. చీరాల పట్టణంలోని స్థానిక ఆర్ఆర్ రోడ్డులోని కెనరా బ్యాంకు వద్ద గల శ్రీలక్ష్మీ పావని గోల్డ్ హౌస్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్నారు. కొత్తపాలెంలో ఏర్పాటు చేసిన పందిరి వద్ద ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమకు అరటిపండ్లతో అలంకారం చేశారు.


వేటపాలెం వీధుల గుండా సముద్ర తీరానికి తరలుతున్న వినాయకులు


వినాయకుడికి తీరం ఒడ్డున ఆఖరి పూజలు చేస్తున్న భక్తులు


వాడరేవులో బందోబస్తు నిర్వహిస్తున్న మెరైన్ ఎస్సై సుబ్బారావు, పోలీసు సిబ్బంది


అనమనమూరులో లడ్డు దక్కించుకున్న హరిబాబు కుటుంబ సభ్యులు


వాడరేవు తీరంలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

జగనన్న పాలనలో సంతోషంగా ప్రజలు

- ఏపీ శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శుక్రవారం సంతమాగులూరు మండలంలోని ఫత్తేపురం గ్రామ పంచాయితీ నందు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో ప్రభుత్వ పథకాలు.. పొందిన లబ్ధిని వివరించి మాట్లాడారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను మొత్తం నెరవేర్చిన ఘనత దేశంలో ఒక్క సీఎం జగన్‌కే దక్కిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అబద్దపు వాగ్దానాలు, కల్లబొల్లి మాటలు చెప్పలేదన్నారు. ఏవి చెప్పామో అవి చేసి.. అన్నిటి కన్నా మిన్నగా నెరవేర్చిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని చెప్పారు. జగనన్న పాలనలో గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఇన్ని చేస్తుంటే టీడీపీ నాయకులు బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. తప్పు చేశాడు కాబట్టే చట్టం చంద్రబాబును జైల్లో ఉన్నాడని తెలిపారు. చట్టం ఎవరికీ చుట్టం కాదన్నారు. నేరం చేయకపోతే రుజువు చేసుకోవాలే తప్ప.. అనవసరంగా జగన్ మీద పడి ఏడవడం ఎందుకని ఎద్దేవా చేశారు. ఎంత మంది కలిసి వచ్చినా ఎన్ని జెండాలు గుంపులుగా మోసుకు వచ్చినా ఫ్యాన్ గాలికి మళ్లీ కొట్టుకుపోతారని జోస్యం చెప్పారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండాలని మరలా సీఎంగా చేసుకోవాలని ఆయన లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సుబ్బారెడ్డికి నివాళులర్పించిన బత్తుల

పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వల్లభరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి భౌతిక కాయానికి మార్కెటింగ్ అండ్ కో ఆపరేటివ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. మండలంలోని నూతలపాడు గ్రామంలోని ఆయన స్వగృహంలో ఉంచిన భౌతిక కాయాన్ని ఆయన సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బారెడ్డికి నివాళులర్పించిన వారిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ రావి రామనాథంబాబు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం మాజీ డైరక్టర్ యద్దనపూడి హరిప్రసాద్, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, పఠాన్ కాలేషావలి తదితరులు పాల్గొన్నారు.


సుబ్బారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న బత్తుల, రామనాథంబాబు

అన్ని రికార్డులు అప్‌డేట్ చేయాలి

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని అన్ని రకాల రికార్డులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్‌డేట్ చేసుకోవాలని ఎంఈవోలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లులు అన్నారు. శుక్రవారం మండలంలోని స్వర్ణ వైసీ (యానాది కాలనీ) ప్రాథమిక పాఠశాలను వారు వార్షిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీ కోటేశ్వరరావు, మార్తమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎండీఎంను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఆకుకూరలతో రక్తహీనత మాయం

పర్చూరు (చినగంజాం): ఆకుకూరలతో రక్తహీనత మటుమాయమై పోతుందని పర్చూరు సీడీపీఓ సుభద్ర అన్నారు. పోషికాహార మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీడీపీఓ కార్యాలయంలో ప్రాజెక్ట్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల్లో మంచి పోషక విలువలు ఉన్నాయని తెలిపారు. వాటి ప్రాధాన్యత, ప్రాముఖ్యత గురించి అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆమె వివరించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలు రక్తహీనతకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లిపాలు బిడ్డకు అత్యంత శ్రేష్టమైనవి అని వాటి ప్రాముఖ్యతను గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు బిడ్డల తల్లులకు వివరించాలని కోరారు. సుశోషిత భారత్, సాక్షర భారత్, స్వశక్తి భారత్ దిశగా అందరూ ముందుకు అడుగులు వేయాలని ఆమె అన్నారు. అనంతరం ఉప్పుటూరు బ్రిడ్జి వద్దకు చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మానవహారంగా ఏర్పాటు అయిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది

హనుమోజీ పాలెంలో నేత్రదానం


సాంబయ్య (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని హనుమోజీపాలేనికి చెందిన ఆర్ సాంబయ్య(83) రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి శుక్రవారం మృతి చెందారు. సాంబయ్య చనిపోయిన వెంటనే కుటుంబ సభ్యులు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులకు తెలియజేశారు. అవయవదాన కమిటీ నేత్రదాన కార్యక్రమంలో భాగంగా శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. భార్య అంజమ్మ, కుమార్తె జాగర్లమూడి ఉమాదేవి, మద్దిరాల అనిత, వెంకటేశ్వరరావులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్ష, ట్రెజరర్‌లు కరి కమలేశ్వరరావు, చుండి సాంబశివరావులు అభినందించారు.

లే ఔట్లు పరిశీలించిన హౌసింగ్ డీఈ

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు జగనన్న కాలనీల లేఔట్లను శుక్రవారం హౌసింగ్ డీఈ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీలోని లబ్ధిదారులతో మాట్లాడుతూ జగనన్న లే ఔట్లలోని ఇళ్ల స్థలాల్లో వెంటనే ఇళ్లు నిర్మించాలని తెలిపారు. అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే ఇళ్లు నిర్మించుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కిషోర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


పంగులూరులో ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

వృద్ధుడికి తప్పిన ప్రాణాపాయం


గాయపడిన వృద్ధుడిని వాహనంలోకి ఎక్కిస్తున్న సీఐ ఫిరోజ్

మార్టూరు: పోలీసులు కఠినంగా ఉంటారనే మాట అటుఉంచి ఆపద సమయాల్లోనూ ప్రాణాలను కాపాడే ప్రాణదాతలుగా నిలుస్తున్నారు పోలీసులు. మార్టూరు సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్ చొరవతో శుక్రవారం ఓ వృద్ధుడు ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం చీర్వానుప్పలపాడు గ్రామానికి చెందిన పోలవరపు చెంచయ్య అనే 84 ఏళ్ల వృద్ధుడు తన మనవడుతో కలిసి ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. స్థానిక జొన్నతాళి సెంటర్‌లో హఠాత్తుగా బీపీ బాగా తగ్గిపోవడంతో బైకు వెనుక వైపు కూర్చొని ఉన్న చెంచయ్య కళ్లు తిరిగి జాతీయ రహదారిపై పడి గాయపడ్డాడు. అదే సమయంలో అటువైపుగా వస్తున్న సీఐ చెంచయ్య పరిస్థితి గమనించి తమ సిబ్బంది సుబ్బారావు, నరేంద్ర సాయంతో పోలీస్ వాహనంలో ఎక్కించుకొని మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చెంచయ్యను పరీక్షించిన వైద్యులు సమయానికి ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి వృద్ధుడు బయట పడ్డాడు. అతనికి అయిన గాయాలకు చికిత్స అందించారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు సీఐ ఫిరోజ్ బృందాన్ని అభినందించారు. వృత్తిలో భాగంగా నేరస్తులపై కఠినంగా వ్యవహరిస్తారనే పేరున్న పోలీసు అధికారులు ఇలా మానవత్వాన్ని ప్రదర్శించటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేతో మేలు

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేతో అనారోగ్యంతో బాధపడుతున్న వారందరికీ మేలు జరుగుతుందని ఉప్పుమాగులూరు-2 సచివాయలం సీహెచ్‌వో ఎస్. మోహనకృష్ణ అన్నారు. శుక్రవారం ఉప్పుమాగులూరు సచివాలయం పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో జరుగుతున్న ఇంటింటా సర్వేను ఆయన పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధులు, పోషకాహారం లోపంతో బాధపడుతున్న వారందరిని సర్వేతో గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయిస్తామని మోహన్‌కృష్ణ వివరించారు. సర్వేలో సచివాలయ ఏఎన్ఎం హసీనా, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

పిచ్చికుక్కలు పట్టివేత

బల్లికురవ: మండలంలోని గుంటుపల్లి, కొత్తపాలెం గ్రామాల్లో చిన్నారులు వృద్ధులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వీధికుక్కల స్వైర విహారానికి శుక్రవారం చెక్ పెట్టారు. గ్రామ సర్పంచ్ ఎం కృష్ణకుమారి, శివన్నారాయణ సెక్రటరీ ఆధ్వర్యంలో ఉచ్చువేసి రెండు గ్రామాల్లో 30 కుక్కల వరకు పట్టుకుని అడవిలోకి తరలించారు. గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కుక్కలను పట్టుకుంటున్న కార్మికులు

ఏటీఎంను పగులగొట్టిన దుండగులు

అద్దంకి రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంను గురువారం రాత్రి పగులగొట్టగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అందిన వివరాల మేరకు స్థానిక బంగ్లారోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్దనున్న ఏటీఎంలోని రెండు మిషన్లలో ఒకదాని ముందు వైపు ఉన్న మానిటర్‌ను పగులగొట్టారు. నగదు ఏమి పోలేదు.. సంబంధిత ఉద్యోగి ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.


దుండగులు పగులగొట్టిన ఏటీఎం